
కథ

# జల్లు

పాండ్రంకి సుబ్రమణి

మూడు రోజులుగా ఆ యింట్లో గాలీవానా ఆగుతూ లేస్తూ తుంపరలా తగ్గుతూ చెలరేగుతూనే ఉన్నాయి. మాటలూ విరుపులూ అంతెత్తు నుంచి జారిపడే పొత్తరాల్లా దొర్లుతూనే ఉన్నాయి. ఆ కోవనవెళ్తూ నిన్న జారవిడిచిన కొసరు మాటను ముడుపులా అందుకొని మేనత్త భాగ్యం మళ్ళీ అందుకుంది. ‘‘అంత అమాయకంగా ముఖం పెట్టి ఎంతెత్తు నిర్ణయాలు తీసుకుంటావురా అబ్బీ! ఎవర్ని అడిగి ముక్కూ ముఖం ఎరగని ఆ అబ్బాయిని మూటా ముల్లెతో సరాసరి యింటికి వచ్చేయమన్నావు? పావని ఫోను చేసింది. నాలుగైదు రోజుల్లో ఎక్స్‌కర్షన్ నుంచి వచ్చేస్తున్నానని. ఇప్పుడేం చేస్తావు?’’ కృష్ణమూర్తి తలెత్తి చూసి కనుబొమ లెగరేసి ఓసారి కన్నార్పకుండా మేనత్త వేపు దృష్టి సారించి మౌనంగా కదలబోయాడు. మేనత్త భాగ్యం అంత త్వరగా విడిచిపెట్టే వ్యక్తి కాదు. ఆమె జలగ లాంటిది. ఆయాసం వచ్చేవరకూ మాట్టాడితే గాని కడుపులో తిప్పుడు తగ్గదు.



‘‘అడుగుతున్నది నిన్నేరా మూర్తీ’’! గదమాయిస్తూ మేనల్లుడికి అడ్డువచ్చి నిటారుగా నిల్చిందామె. ‘‘చెప్పాను కదత్తయ్యా! పావని అదే సమయాన యింటికి రావచ్చన్న విషయం తెలియదని’’

‘‘నేను చెప్పలేదూ – స్టేషనుకి వెళ్లి దానిని తీసుకురమ్మనమని’’

‘‘చెప్పావత్తయ్యా! సరైన తారీఖు చెప్పనందున ఆఫీసు గొడవల్లో పడి మర్చిపోయాను’’.

‘‘అలాగని తెలియదని మాత్రం అనకు’’.

అప్పుడు వేదమూర్తి చెల్లికి వత్తాసుగా అక్కడకొచ్చి నిల్చున్నాడు. ‘‘చదవక ముందు బాగానే అనేవాడట – కాకర కాయని. చదివింతర్వాత వాడు కీకరకాయ అనడం ఆరంభించాడట. నీ మేనల్లుడు అటువంటి వాడు. అడ్డమైన వాళ్ళందరితోనూ భుజాలు పూసుకుని తిరుగుతుంటే బుర్ర ఎలా పనిచేస్తుంది. దారెలా కనిపిస్తుంది. రెండునెల్ల క్రితం అమ్మ ప్రేమతో మెళ్ళో వేసిన గొలుసుని ఎక్కడో పడేసుకున్నాడు. అదీను తానుగా చెప్పాడా – నేనడిగిన తరువాత – చావు కబురు చల్లగా చెప్పినట్లు – విషయం బయట పెట్టాడు. అది విని అమ్మ ముఖం ఎంతలా వాడిపోయిందో! నీరసంగా ఉన్న అమ్మ గుండె ఎగిసిపడిందో!’’

‘‘అదిగో! మళ్లీ అదే ఊసు ఎత్తారూ అన్నా

చెల్లెల్లిద్దరూ! అందుకే అంటారు పాడిందే పాడరా పాచిపళ్ళ దాసడా! అని అదే డిజైను గొలుసు చేసి వాడి మెళ్లో వేస్తానన్నాగా!'' ఇంకెన్నిసార్లు చెప్పాలి మరి?'' వనజాక్షి వంటగది నుంచి రివ్వున దూసుకు వచ్చి అడ్డుగోడలా నిల్చుంది వాళ్ళ మధ్య. ''ముద్దుల కొడుకుని మహాగొప్పగా వెనకేసుకొచ్చావులే! మన మందరమూ చేరి పది గొలుసులు చేసి పెట్టినా మా అమ్మ ఆశీర్వదించి వేసిన ఆ ఒక్క గొలుసుకీ ఈడు కాదే వనజాక్షీ! మా మామ్మగారిచ్చిన బంగారం కరిగించి చెరిపించి మనవడికి అప్యాయంగా వేసిన ఆభరణం అది. అందులో ఉన్నది బంగారం మాత్రమే అనుకోకు. అందులో మా అమ్మ తనువంతా ఉంది మమతంతా ఉంది. దానిని నిర్లక్ష్యంగా పారేసుకునే హక్కు వీడికి లేదు'' అన్నాడు వేదమూర్తి.

''ఒప్పుకుంటానండి. పోయింది మామూలు బంగారం కాదని కూడా ఒప్పుకుంటానండి. మీ కొడుకు నిర్లక్ష్యం వల్ల పెద్ద తప్పే జరిగిపోయింది. కాని పోయింది మళ్లీ రాదుగా! దానిని దొరకపుచ్చుకున్నవాడు - వెతికి వేసారి మనకందజేయడు కదా! గొలుసు గురించి పదే పదే నిలదీసి అడిగితే వాడి మూడ్ పాడయిపోయి ఉద్యోగ సద్యోగాలపై మనసు పోవద్దూ? మీకూ మీ చెల్లికి పట్టుకున్న అసలు దిగులేమిటో నేను చెప్తాను. పోగొట్టుకున్న బంగారపు గొలుసుని ఊచకోత కోసం ప్రయోగిస్తున్నారే గాని - మీ అసలు గుబులుకి అసలుకారణం నాకు తెలియదా! వయసుకొచ్చిన అమ్మాయి యింట్లో ఉన్నప్పుడు, పరాయి వాళ్ళబ్బాయి యింట్లోకి దిగొచ్చా - అదీను వరుసగా మూడు రోజులపాటు కలివిడిగా తిరగొచ్చా - అదే కదూ యింతటి రాద్ధాం తానికీ కారణం? ఆ అబ్బాయి యిక్కడున్న మూడు రోజులూ పావని నా కనురెప్పల మధ్య మెసలుతుంది. నాతోనే నా గదిలోనే ఉంటుంది. ఆ కుర్రాడి చూపు కాదు - గాలిని కూడా సోకనివ్వను. చాలా?'' ఆ మాటలు విని కృష్ణమూర్తి నొచ్చుకుంటున్నట్లు దైన్యంగా ముఖం పెట్టి.


''అలాగనకే అమ్మా! మీ అందరి మాటలూ వింటుంటే మనసుకి కష్టంగా ఉంది. ప్రేమ్‌కుమార్ అస్సలు అటువంటివాడు కాదే!'' అన్నాడు. ''మధ్యన పానకంలో పుడకలా నువ్వొకడివిరా! మీ ఫ్రెండు అటువంటి వాడని నేనన్నానా! కూతుళ్ల కన్న తల్లులందరికీ అటువంటి భయం కాస్తోకూస్తో ఉంటుంది. అంచేత మీ అత్తయ్యకి భరోసా యిస్తున్నాను. అంతే!'' అంతలో వేదమూర్తి తండ్రి హనుమంతరావు అల్లంత దూరాన ఉండగానే మాటలు కలుపుతూ వచ్చాడు. ''పోయిన వయసూ పోయిన ప్రాణమూ మళ్లీ రానే రావు, జరిగిపోయిన దాని గురించి పదేపదే తల బ్రద్దలు కొట్టుకుంటూ ఎంతసేపు ఉంటారిలా! బైదిబై ఈజ్ యువర్ ఫ్రెండ్ సింగిల్'' కృష్ణమూర్తి తల అడ్డంగా తిప్పాడు.

''అదన్నమాట అసలు సంగతి! పెళ్ళి పీటలపై కూర్చోబోతున్నాడని కూడా చెప్పడానికి వీలులేదన్న మాట! అటువంటి పచ్చి బెండకాయ బ్రహ్మచారిని చూసి ఆడపిల్లల్ని కన్న మహాతల్లులు తల్లడిల్లిపోరా మరి! మరొకటి - నువ్వు కోల్హాపూరులో చదువుకుంటున్నప్పుడు నిన్నోసారి విషజ్వరం తాకింది. అలా ఒంటరిగా బేలగా మంచాన పడి ఉన్నప్పుడు ఆ అబ్బాయి యింటివాళ్ళే కదూ - నిన్ను వాళ్ల యింటికి రప్పించుకొని నువ్వు తేరుకునే వరకూ నీ ఆలనా పాలనా చూసింది? బాగా గుర్తుకి తెచ్చుకొని చెప్పు''.

''థాంక్యూ తాతయ్యా! మర్చేపోయాను మంచి సమయానికి జ్ఞాపకం చేశావు. వాళ్ళందరూ చాలా మంచి వారు తాతయ్యా! వాళ్లు గాని సమయానికి ఆదుకొనకపోతే నేను గాని సమయానికి తేరుకొని ఉండకపోతే - సెకెండ్ ఇయర్ బి. ఇ. ఇక గోవిందా అనాల్సిందే!''

''నా యక్షప్రశ్న యింకా ముగియలేదురా అబ్బీ! నీకిది క్రాస్ ఎగ్జామినేషన్ అనుకో - అప్పుడు - నువ్వు వాళ్ల యింట్లో పడకవేసినప్పుడు ఆ ప్రేమ్‌కుమార్ యింట్లో వాళ్ల అక్కాచెల్లెళ్లెవరూ లేరా?''

''యు ఆర్ కరెక్టు తాతయ్యా! ఉండేది - వాసంతి వాళ్ల చెల్లెలు.''



''అప్పుడా పిల్ల అన్ మ్యారీడ్ కదూ!''

''యు ఆర్ గ్రేట్ - యు ఆర్ ఎ జీనియస్ తాతయ్యా! అప్పుడా పిల్లకు పెళ్లి కాలేదు'' ఇంటి కప్పు ఎగిరిపోయేలా కేకేశాడు కృష్ణమూర్తి. ''క్రాస్ ఎగ్జామ్ అయిపోయింది. ఇప్పుడంతా అర్థమైంది. ముద్దాయిల ప్రసక్తే లేదు. ఇక తీర్పు నాది - ఓర్పు మీది. మనింటికొచ్చే ఆ అబ్బాయి మరెక్కడో ఉండడు. హాలులో కూడా ఉండడు. నాతో నా గదిలోనే ఉంటాడు. ఆ కుర్రాడికి మీ ఆఫీసు అతిథి విడిదిలో బస ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నావు కదూ - వేదమూర్తి! అదీ అవసరం లేదు. అబ్బీ! ఆ అబ్బాయి - అంటే ప్రేమ్‌కుమార్ విల్ బి మై గెస్ట్! హి విల్ బి మై గెస్టాఫ్ ఆనర్. ఎన్నాళ్లయినా ఉంటాడు. ఎప్పుడైనా వెళ్తాడు. నౌ యు మే ఆల్ గో!'' మామయ్యగారి మాటలు విని వనజాక్షి కడుపులో పాల ముంత గుమ్మరించినట్లయింది.

కొండను చిల్చి ఎలుకను పట్టుకున్నంతగా అందరూ ఆపసోపాలు పడిపోతున్నప్పుడు మొగుడూ ఆడపడుచూ కలిసి కొడుకుని రాచిరంపాన పెడుతున్నప్పుడు ఆమె తల్లి మనసు కటకటలాడిపోయింది. గొలుసుని పోగొట్టుకోవడం - బామ్మను అమితంగా బాధపెట్టడం - దీనికితోడు అడగా పెట్టకుండా ఓ బ్రహ్మచారిని యింట్లోకి సరాసరి దిగమనడం - ఇవన్నీ కొడుకు నిర్లక్ష్య వైఖరినే తెలియజేస్తున్నాయి. ఆ వైఖరి క్షమించరానిదే! కాని కుర్రబుద్ధి కోతిబుద్ధి అని ఊరకేనా అన్నారు! దానిని అదనుగా తీసుకొని వాడి చిన్న మనసుని మాటిమాటికీ సూటిపోటు మాటలతో పొడవడం అమానుషం కాదా! అప్పుడు పిడికర్రను తాటిస్తూ తాతయ్యా వెనుదిరిగేటప్పుడు - కృష్ణమూర్తి ''తాతయ్యా!'' అని పిలిచాడు.

ఆ పిలుపులో ఎంతటి మార్దవం! మరెంతటి అనురాగం! హనుమంతరావు గారితో సహా కదిలివెళ్తున్న వారందరూ ఆగి తిరిగి చూశారు. ''ఐ యామ్ సారీ తాతయ్యా! బామ్మకు నచ్చజెప్పు తాతయ్యా! గొలుసు పడేశానని చాలా నొచ్చుకుంటుంది. ముందులా నాతో మాట్లాడడం లేదు తాతయ్యా! మాట్లాడినా రెండు ముక్కల్లో ముగిస్తుంది. అదీను నేను పలకరిస్తేనే'' దగ్గరకు వచ్చి మనవడి నెత్తిపైన చేతినుంచాడు హనుమంతరావు. ''మీ బామ్మ ఆ తరానికి చెందిన స్త్రీ. మృదువైన మనోరాగాలతో పెరిగి సంప్రదాయాలను కంచుగోడల్లా మార్చుకొని పెద్దతనం చేరుకున్న స్త్రీ. అది అలాగే ఉంటుంది. డోంట్ వర్రీ మై యంగ్ బోయ్. దానిని వలలో వేసుకొని ఒక దారికి రప్పించడం నా వంతు. అయినా నువ్వు కుర్రవెధవ్వి. నా రొమాన్సు కెపాసిటీ గురించి నీకేం తెలుసులే!'' మామగారి సరసమైన మాటలకు వనజాక్షి మొదట రవంత సిగ్గుతో చూపులు తిప్పుకున్నా - ఆ వెనువెంటనే పెను అలవంటి ఓ అనుపమ అనురాగ మృదుభావన ఉత్తుంగ తరంగమై లేచి తనువెల్లా నురగలు పొంగేలా తాకింది. గుండె లోతులు అంత తీవ్రంగా తడిసిపోవడం ఆమెకెన్నడూ జరగలేదు.

బహుశః తన కన్నతండ్రి పట్ల కూడా అంతటి ఉదాత్త భావన కలగలేదేమో! ఉన్నపాటున వెళ్లి ఆయన రెండు కాళ్లూ పట్టుకొని నెత్తిన పెట్టుకోవాలనిపించింది. ''అదేవిటమ్మా అలా కన్నీరు కార్చేస్తున్నావు? మై లైఫ్ లవ్స్ యువర్ సన్... వయసు అడ్డువచ్చి గాని - లేకపోతే ఈపాటికి నాకు పెళ్లామే ఉండకపోను'' అది విని అందరూ గొల్లున నవ్వారు.

మరునాడు తొమ్మిది గంటల ప్రాంతాన టి.వి.లో గణాంక అర్థశాస్త్ర విషయాలపై ప్రపంచీకరణ పోకడలపై సాగుతున్న ఎంబిఏ విద్యార్థుల గ్రూప్ డిస్కషన్ వింటూ - మోడరేటర్ చేస్తున్న వ్యాఖ్యల్ని గమనిస్తూ కూర్చున్న కృష్ణమూర్తి కాలింగ్ బెల్ మోగడం విని ఎవరైనా వచ్చి తలుపు తెరుస్తారని ఎదురుచూస్తూ చూపులు సారించాడు. ఎవ్వరి అలికిడీ లేకపోవడం గమనించి ఇంకెవరూ పనావిడే అయుంటుందనుకుంటూ లేచి వెళ్లి తలుపు తీశాడు.

తీస్తూ వెనక్కి తిరగబోయిన వాడల్లా తన కళ్లను తనే నమ్మలేనట్లు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు. మరికాసేపటికి తేరుకుని ''నువ్వా'' అన్నాడు - భుజాన ట్రావెలింగ్ బ్యాగ్‌తో నిల్చున్న మిత్రుణ్ణి చూసి. ''నేనంటే నేనే! నువ్వంటే నువ్వే!'' విలాసంగా గిరజాలను ఎగురవేస్తూ బదులిచ్చాడు ప్రేమ్‌కుమార్.

''అది కాదురా! నువ్వు రైలుబండిలో రేపు ఉదయం కదూ చేరుకుంటానన్నావు. బోగీ నెంబరు బెర్తు నంబరు అన్నీ ఇచ్చావు కదరా!''




''ఇచ్చాను – నేనెప్పుడు కాదన్నాను? అంతా సానుకూలంగా అమరింది కాబట్టి గాలోడలో ఎగిరి వచ్చాను. ఇప్పుడు నీ నీడన చేరాను. అప్పుడప్పుడు ప్లజంట్ సర్‌ప్రయిజ్ యివ్వడం నాకలవాటని నీకు తెలుసు కదా! అంతా కంపెనీ ఖర్చులు. మనదే ముంది?

''యు ఆర్ గ్రేట్! ఘనకార్యమే చేశావు – నో డౌట్! ఈ సంగతయినా చెప్తే ఎయిర్‌పోర్టుకి వచ్చి పికప్ చేద్దును కదరా!''

''అలా కబురందించి వస్తే సర్‌ప్రయిజ్ ఏముందిరా మూర్తీ!'' అంటూ బూట్సు విప్పి మేజోళ్లతో గడప దాటి లోపలికొచ్చాడు ప్రేమ్‌కుమార్.

''చిన్ననాటి కుర్రబుద్ధులు పోనిచ్చుకున్నావు కాదు వెధవన్నర వెధవా!'' అని మిత్రుడి జబ్బ నుంచి ట్రావెలింగ్ బ్యాగ్ అందుకుని మిత్రుడి రాక విషయమై యింట్లో వాళ్లకు పిలుపునివ్వాలని నోరు తెరిచే లోపల ఇంటిల్లిపాదీ అక్కడ గుమిగూడారు. మొదట హనుమంతరావు ముందుకు వచ్చి ప్రేమ్‌కుమార్‌ని మెత్తగా గుండెకద్దుకొని ఆశీర్వదించి ''ప్రయాణం బాగానే సాగింది కదూ!'' అని పరామర్శించారు.

''గ్రేట్ – రియల్లీ గ్రేట్'' అంటూ బదులిచ్చి పెద్దలందరికీ నమస్కరించి మేజోళ్లను కూడా గబగబా విప్పి అటువెళ్లి బూట్లపై విసిరివచ్చాడు – ఉత్సాహం ఉట్టిపడే ముఖంతో లోపలికొచ్చి హాలు మధ్య వ్రేలాడుతూన్న చిత్రపటాన్ని చెక్కుచెదరకుండా చూస్తూ నిల్చున్నాడు. అది యేడేళ్ల క్రితం కొల్హాపూర్‌లో చదువుకుంటూన్న రోజుల్లో అతి ప్రయాసకోర్చి శిల్పిలా తీర్చిదిద్ది మలచిన స్వంత చిత్ర రచన. అద్భుత స్త్రీ సౌందర్యానికి రూపకల్పన.

''నేను ఆనాడు చిత్రించి చూపించిన ఆ పెయింటింగు నీకింకా జ్ఞాపకం ఉందన్నమాట!'' కృష్ణమూర్తి ముచ్చటగా మిత్రుడి ముఖంలోకి చూస్తూ అడిగాడు.

''జ్ఞాపకం ఎందుకుండదూ! ఆ రోజుల్ని మరిచిపోతే కదా! నువ్వొకవిధంగా చతురంగ మేధావి పిశ్చర్ వంటివాడిరా మూర్తీ!'' అర్థం కానట్టు చూశాడు కృష్ణమూర్తి.

''ఉపమానం అందలేదేమో మరి! అతను ఒకే ఒక ప్రపంచ చతురంగ పోటీల్లో నెగ్గి ప్రక్కకు తప్పుకున్నాడు. గూడులోకి వెళ్లి దాక్కున్న గువ్వలా విరమించుకున్నాడు. సీను నుంచి మాయమయ్యాడు. నీ విషయం కూడా అంతే కదా – ఒకే ఒక చిత్రలేఖనంతో కళా ప్రపంచానికి గుడ్‌బై చెప్పేశావు.

అది విని వేదమూర్తి నవ్వాడు. నవ్వుతూనే చెల్లి సారించిన చూపుల సంకేతం అందుకొని గొంతు సర్దుకొని అడిగాడు – ''ఊళ్లో ఎన్నిరోజుల పనుందోయ్?''

''కనీసం పది రోజులయినా ఉంటానండి'' ఆ బదులు విని కూతురి ముఖం వెలవెలబోవడం గమనించిన హనుమంతరావు పండిన మీసాల మాటున నర్మగర్భంగా నవ్వుకున్నాడు. ఇటువంటి వాళ్ల మనఃస్థితినే తీరాన పడేసిన చేపల పరిస్థితితో పోల్చుతుంటారు. నీటిలోనే ఉంటూ నీటిని అంటనీయకుండా ఉంటారు. ఎదుటివారిని దగ్గరకు చేరనివ్వకుండా ఉంచుతారు.

లోపలికెప్పుడు వెళ్లిందో తెలియదు – వనజాక్షి నవ్వు ముఖంతో వచ్చి – ట్రేలో ఉన్న కాఫీ కప్పుని అందిచ్చి బిస్కట్ల ప్లేటు కూడా ప్రక్కనుంచి ప్రేమ్‌కుమార్ చేసిన నమస్కారాన్ని స్వీకరించి ''ముందు ఇవి తీసుకో నాయనా! తరువాత స్నానం కానిచ్చి టిఫిన్ తిందువుగాని'' అంది. ఆమెకు ప్రేమ్‌కుమార్‌ని చూస్తుంటే అవ్యాజమైన ప్రేమ పుట్టుకొస్తుంది. ఎన్నో యేళ్ల తరబడి పరిచయమూ బంధుత్వమూ గల స్వంత వంశంలోని అబ్బాయిని చూస్తున్నట్లుంది. ఇంతకూ ఎవరిని పోలినట్లు – ఇంకెవరు – తన చిన్న తమ్ముడే ఈ ప్రాయాన ఒకనాడు ఇలాగే ఉండేవాడు మరి. ఊరు కాని ఊరు కొల్హాపూరులో ఇంజనీరింగు సీటు దొరకడం – వెనుకా ముందూ ఎవరూ లేని ఆ ఊళ్లో కొడుకు మంచాన పడటం, ప్రేమ్‌కుమార్ కుటుంబంలోని వారందరూ అబ్బాయిని యింటికి తీసుకువచ్చి స్వస్థత చేకూరే వరకూ ఆలనా పాలనా చూడటం – ఆమె కళ్ల ముందు అవన్నీ ఆగని నలుపు – తెలుపు రీలులా తిరుగుతూనే ఉన్నాయి. ''థాంక్యూ అత్తయ్యా! నేనిప్పుడు కాఫీ తప్ప మరేమీ తీసుకోను. క్లుప్తంగా ఓ చిన్నపాటి ప్రార్థన చేసిన తరువాతనే యేదైనా నోట్లో పెట్టుకుంటాను. ఒరేయ్ మూర్తీ! నువ్వు మరీ సెల్ఫిష్‌గా తయారయ్యావురా. నా గురించి యేమీ చెప్పలేదన్నమాట!'' చనువుగా కృష్ణమూర్తి దవడన చిన్న లెంపకాయ వేస్తూ అన్నాడు ప్రేమ్‌కుమార్.

''అవునమ్మా! కంప్యూటర్ ఇంజనీర్‌గా కుదిరినా – రెండు మూడు విదేశాలకు వెళ్లి వచ్చినా – అప్పటి అలవాట్లు ఇంకా తగ్గినట్టు లేదు. వీడి వాలకం చూస్తుంటే సంప్రదాయాలు మరింత ఎక్కువగా ఒంటబట్టినట్లున్నాయి. ప్రొద్దుట లేచి యేదీ ముట్టుకునేవాడు కాదు. ప్రేమ్‌కుమార్ గురించిన మాటలు వింటుంటే ఆగని ధారగా వనజాక్షి కడుపులో అమృతం పోస్తున్నట్లున్నది. ఎంతటి ఉత్తమ లక్షణాలు. అందునా ఈకాలపు కంప్యూటర్ యుగంలో! ఇప్పుడు గాని లక్ష్మి యింట్లో ఉంటే ఎంత బాగుణ్ణు! రెవెన్యూ సర్వీసుకి సెలక్టయి ట్రైనింగు కోసం మౌంట్ అబూ వెళ్లిపోయింది.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటే ఒకర్నొకరు యిష్టపడతారేమో! అయినా ప్రేమ్‌కుమార్ వంటి తెలివి గల కుర్రాణ్ణి కాదనగలిగే అమ్మాయి ఇంటాబయటా ఎక్కడైనా ఉంటుందా! ఆమె మనసు ఎగిసెగిసి పడసాగింది. అలా ఆలోచిస్తూ దగ్గరకు వెళ్లి అసంకల్పితంగా ప్రేమ్‌కుమార్ నుదుట చేయివేసి నిమిరింది. కొన్నికొన్ని సమయాల్లో కొన్నికొన్ని మానవీయ మనోరాగాలు అలాగే ఉంటాయి. విలువైన రవ్వల్లా రాలిపడుతుంటాయి. ఇంతకూ ఆమె ప్రేమ్‌కుమార్‌ని చూడడం అదే మొదటిసారి!

అప్పుడు అక్కణ్ణించి భాగ్యం మాటలు చెవిలోంచి చెదరే పేలపిండి పొడిలా గాలి తెరల్ని నింపాయి. ''మాటలో మాటగా అడుగుతున్నానబ్బాయి – ప్లేను ఎక్కేటప్పుడు ఒకమారు దిగేటప్పుడు ఒకమారు యేదేదో ఇస్తూనే ఉంటారటగా! మరి ఉదయం నుంచీ యేమీ తీసుకోకుండానే దిగానంటున్నావు?''

ప్రేమ్‌కుమార్ చిన్నగా నవ్వి ''ఇచ్చారండి. నేను తీసుకోలేదు. టీ తప్ప. బైదిబై – మిమ్మల్నందర్నీ ఇలా చూస్తుంటే ఒక మాట చెప్పాలని మనసు రెపరెపలాడుతుందండి'' అన్నాడు. అతడేమి చెప్పబోతున్నాడోనని అందరూ అటు చూస్తూ నిల్చున్నారు.

''మీ యిల్లు ఎంత నిండుగా ఉందని. ఒకానొకప్పుడు మా యిల్లు కూడా యిలాగే సందడిగా ఉండేది – మా చెల్లి మెట్టింటికెళ్లేంతవరకు''.

''మా యిల్లు అంతలావు నచ్చింది కాబట్టి – నెల్లాళ్లపాటయినా మకాం వేస్తావన్నమాట'' నవ్వు పొరల్ని దాచుకునేందుకు తెగ ప్రయత్నిస్తున్న దానిలా భాగ్యం చీర చెంగుని నోటికడ్డంగా పెట్టుకుని – ఒక విపరీత వాఖ్యానింద మోపింది. అన్నా చెల్లీ హనుమంతరావు కడుపున పుట్టినవారే – కాని ఆయనకూ వీళ్లకూ మధ్య ఎంత వ్యత్యాసం ఉంది! అంతెందుకు – తన అత్తగారు ఆడపడుచునీ కట్టుకున్న భర్తనీ కన్న మహాతల్లి – మహాలక్ష్మిలా ఉంటుంది. పెద్దమనసుతో అందరికీ తల్లయి మెసలుకుంటుంది. ఆమెగారి బుద్ధులైనా ఆడపడుచులో కనిపిస్తాయా – మచ్చుకైనా! కాగడా వెలిగించి వెతకాలేమో – వనజాక్షి రవంత విసుపోతూ ఆలోచించసాగింది. ప్రేమ్‌కుమార్ ఓపారి తేరిపార చూసి అదేమీ విననట్లు అటు చూడకుండా వనజాక్షికి దగ్గరగా వచ్చి ''అత్తయ్యా! మీ యింట్లోపలకు ప్రవేశించిన తరువాత నాకెలా అనిపించిందో తెలుసా? మా ఊరి మువ్వల గోపాల స్వామి వారి ఆలయ ప్రాంగణంలో కూర్చుని సెహనా

రాగంలో త్యాగరాజస్వామి వారి భక్తికీర్తన వింటున్నట్లుంది.''

''అంటే నీకు మన కర్ణాటక శాస్త్రీయ సంగీతం గురించి తెలుసన్నమాట!'' పులకరించిన మనసుతో అమితంగా అబ్బురపడ్తూ అంది వనజాక్షి.

''అదేమిటమ్మా తెలుసా అని అలా అడుగుతావు. అప్పుడప్పుడు పర్వదినాలలో అందునా ధనుర్మాసంలో వాడు సంగీత కచ్చేరీలు ఇస్తుంటాడు.''

''మరి గురుదేవులెవరో?''

''ఇంకెవరు? వాడి తల్లిగారే!''

''అలాగా!'' వనజాక్షి అతిశయంతో అంది.

అప్పుడు హనుమంతరావు ఆ రసమయ సంభాషణలో జొరబడ్డాడు. ''అలా మరీ ఆశ్చర్యపోకమ్మా! ఇంతదూరం వచ్చి మనకు ఆ ముమ్మూర్తుల సంగీతం వినిపించనీయకుండా వెళ్లిపోతాడా! ఇంతమందిని నిరాశపర్చి వెళ్తే సంగీత సరస్వతి అలుక వహించదూ!'' అంటూ కోడలికి భరోసా యిచ్చి ప్రేమ్‌కుమార్‌ని సమీపించి ''నేను కర్నాటక శాస్త్రీయ సంగీతాభిమానిని కాబట్టి - యేదీ చెప్పు చూద్దాం'' అనేంతలో కృష్ణమూర్తి తాతయ్యకు చప్పున అడ్డువచ్చాడు. ''నా ఫ్రెండు రాకరాక మనింటికి వచ్చాడు - యిబ్బంది యివ్వకు తాతయ్యా!''

''సంగీత రసన గురించి తెలుసుకోవాలనుకోవడం యిబ్బంది యివ్వడమా! బోడి తెలివితేటలూను - నువ్వూను - లే అడ్డులే'' అని మనవణ్ణి తొలగించి అన్నాడు.

''చెప్పబ్బాయి - త్యాగరాజస్వామి వారి ఈ కీర్తనలోని తాళం చెప్పు - అనురాగము లేని మనసున ...'' ప్రేమ్‌కుమార్ హనుమంతరావుని పూర్తికానివ్వకుండానే చివరి పదాన్ని అందిపుచ్చుకున్నాడు - ''సుజ్ఞానము రాదు. సరస్వతి రాగం - తాళం - రూపకం''

''భేష్ భేష్! సంగీత సాధన నువ్వు తప్పనిసరిగా నిత్యమూ చేస్తుండాలి. కాలమంతా ఈ కంప్యూటర్‌ల ప్రపంచంలో పడి అనవతరమూ బుర్రను వేడెక్కిస్తూ జీవించడం బ్రతుకు దుర్భరమయిపోతుంది. శాస్త్రీయ సంగీతాన్ని - ఆ శాస్త్రీయ సంగీతంలో యిమిడి ఉన్న ఆధ్యాత్మికతనూ బ్రతుకు మార్గాన నింపుకుంటూ సాగిపో!'' ఆ కీర్తనలోని ఆ సుకుమార ఉదాత్తభావం ఇంటిల్లిపాదినీ తాకడానికి - అందరికీ తాకాలనే మామగారు ఆ కీర్తన ప్రస్తావన ఎత్తారని గ్రహించి -

''ఎంతటి ప్రాజ్ఞత! తన పంచరత్న కీర్తనలో త్యాగయ్య ఊరికే అన్నారూ - సమయానికి తగు మాటలాడు...'' అని. అప్పుడు ప్రేమ్‌కుమార్ రవంత తలవంచి - మీవంటి పెద్దల ఆశీర్వాదం ఉండాలే గాని - తప్పకుండా సంగీత సాధన చేస్తూనే ఉంటాను తాతగారూ!'' అని హనుమంతరావు పాదాలను రెండు చేతులతో తాకి ఆ తరువాత వేదమూర్తి పాదాలను కూడా తాకి క్రింది ఉంచిన ట్రావెలింగ్ బ్యాగ్ అందుకొని గుమ్మంవేపు కదిలాడు ప్రేమ్‌కుమార్.

''అది సరేరా - నువ్వు సంగీత సాధన చేస్తూనే ఉండువుగాని. నీకు యేర్పాటుచేసిన గది లోపల ఉంది. గుమ్మంవేపు వెళ్తే వచ్చిన తోవనే కిందికి దిగుతావు'' కృష్ణమూర్తి నవ్వుతూ మిత్రుడి చేతి నుంచి ట్రావెలింగ్ బ్యాగ్ లాక్కోబోయాడు.

''థాంక్యూ - థాంక్యూ ఎ లాట్! కాని మా కంపెనీ వాళ్లు ఎంత వద్దని చెప్తున్నా వినిపించుకోకుండా వివిపి గెస్ట్‌హౌస్‌లో విడిది యేర్పాటుచేశారు. రివ్యూ మీటింగ్‌లవి - క్లయింట్స్‌తో సమాలోచనలు - ఇలా ఇంకెన్నో ఉంటాయి కాబట్టి ఆఫీసుకి పక్కనే ఉండాలని ఆదేశించారు. మరొక చిన్న భోగట్టా. పది రోజులపాటు నాతోనే ఉండటానికి ఒక డ్రైవరు - ఒక పర్సనల్ స్టాఫ్‌ని కూడా యేర్పాటు చేశారు. వాళ్లిద్దరూ కింద నాకోసం కాచుకూర్చున్నారు. బైదిబై -నీ ప్రియమైన బామ్మగారు కనిపించదేం?''

కృష్ణమూర్తి యేదో గొణిగినట్టు పెదవుల్ని కదిలించి అమ్మానాన్నల వేపు చూపులు సారించి - ఆ తరువాత తాతయ్య వేపు మనికితపాటుతో ముఖం పెట్టి చూశాడు.

ఎవ్వరూ కదలివచ్చే స్థితిలో లేరు. బెల్లం కొట్టిన రాళ్లలా నిల్చున్నారు ఇంటిల్లిపాదీ. ''బామ్మగారు గుడికి వెళ్లారన్నమాట. ఆ తరానికి చెందినవారు కదా - గుళ్లూ గోపురాలూ తిరుగుతుంటారు. వస్తే నా నమస్కారం మరిచిపోకుండా చెప్పాలిరా మూర్తీ!'' అంటూ ట్రావెలింగ్ బ్యాగ్ అందుకొని చకచకా మెట్లు దిగాడు ప్రేమ్‌కుమార్. నల్లటి మబ్బులా - యేనుగంత మబ్బులా వచ్చి యింటిని ముంచి వెళ్తాడనుకున్న ప్రేమ్‌కుమార్ ఫెళ్లుమన్న కిరణంలా జల్లులా కురిసి మరలిపోతాడని ఎవ్వరూ అనుకోలేదు. మాటా పలుకూ లేని షాక్‌తో 'కథ అడ్డం తిరిగింది' అని అందరూ అనుకుంటున్నప్పుడు - చకచకా దిగి వెళ్తున్నవాడల్లా - యేమనుకున్నాడో యేమో - మళ్లీ మూడడుగుల్లో తిరిగి ఎగిరే బంతిలా పైకి వచ్చాడు. ''ఐ యామ్ సారీ - రియల్లీ సారీరా మూర్తీ! ఈమధ్య మతిమరుపు ఎలా తయారయిందంటే - కొత్తగూడెంలోని మెర్క్యురీలా పెరిగిపోతూంది. ఒకటా రెండా కంప్యూటర్ ప్రోగ్రాములు - వాటికోసం వెతికే సొల్యూషన్‌లు. నురిపిడికి లోనయిన నూలు పోగుల్లా మెదడుని మెలివేస్తున్నాయనుకో!''

కృష్ణమూర్తి యేమయిందన్నట్లు మిత్రుడి భుజంపైన చేయివేసి అయోమయంగా చూశాడు. ప్రేమ్‌కుమార్ బదులివ్వకుండా కాస్తంత ఆగమన్నట్లు సైగచేసి ట్రావెలింగ్ బ్యాక్ సైడు పాకెట్‌లోకి చేతిని పోనిచ్చి ఒక పొట్లం తీసి అందిచ్చాడు.

''ఆలస్యానికి తోడు మరింత ఆలస్యం ఎలా అయిందంటే - అమ్మ స్వయంగా యిచ్చి రమ్మంటున్నప్పుడు మా ఎం.డి. ఆదేశానుసారం ఒక ముఖ్యమైన ప్రాజెక్టుపైన పదిహేను రోజులపాటు స్వీడన్‌లో ఉండాల్సి వచ్చింది. పనిలో పనిగా డెన్మార్క్ కూడా వెళ్లి అక్కడ ప్రాజెక్టుని కూడా చూసిరమ్మనమని ఆదేశాలందాయి. నీకు తెలుసుకదా - బాస్ ఈజ్ ఆల్‌వేస్ రైట్ - అక్కడొక పదిహేను రోజులపాటు ఉన్నాను. అక్కణ్ణించి నీకొకసారి ఫోను కూడా చేసినట్టున్నాను. కాని ఇది చెప్పడం మాత్రం మర్చిపోయాను. మొత్తానికి నన్ను చూస్తే నీకు ఒక విషయం తెలిసిపోతుంది - కంప్యూటర్ మనిషి మరమనిషిలా మారిపోతున్నాడనుకో!''

''ఏదేదో చెప్పుకుపోతున్నావు గాని - అసలు విషయానికి రానంటున్నావురా ప్రేమ్! ఇంతకూ ఇందులో ఏముందో చెప్పనంటావు.''

''ఇది నీది! ఇప్పుడు నీ ముందున్నది. విప్పి చూసుకోవచ్చుగా! ఒన్స్ ఎగైన్ ఐ ఆఫర్ మై అపాలజీస్! మొన్న అదేదో ప్రమోషన్ స్క్రీనింగ్ టెస్టుకోసం మా ఊరొచ్చినప్పుడు - మా యింట్లో రెండ్రోజులు మకాంవేశావు జ్ఞాపకం ఉందా? అప్పుడు ఎంత చెప్పినా వినకుండా హాలులోని సోఫాలోనే పడుకునేవాడివి టి.వి. చూస్తూ. అమ్మ వాక్యూమ్ క్లీనర్‌తో సోఫా సెట్టుని శుభ్రం చేస్తున్నప్పుడు దొరికిందిది భై!'' అంటూ మెట్లు దిగిపోయాడు ప్రేమ్‌కుమార్. ఇంకా అయోమయంలోనే ఉంటూ - అర్థరహితంగా చూస్తూ పొట్లం విప్పి ఆనందాతిశయంతో నోటమాట రాక ఊపిరి బిగబట్టుకుంటూ, తాతయ్య చేతి కందించాడు కృష్ణమూర్తి. అది చూసి నుదుట అనుభవపు చారల్ని ఫెళ్లుమనేలా చూపిస్తూ నిండుగా నవ్వాడు హనుమంతరావు. పొట్లాన్ని అందుకున్న వనజాక్షి కళ్లు తడిసిపోయాయి. ''ఏడుకొండలవాడా! ఏడు కొండలవాడా! ఈవారమే వచ్చి నీకు ముడుపు చెల్లించుకుంటానయ్యా!'' అరమోడ్పు కళ్లతో రెండు చేతులూ పైకెత్తి నమస్కరించింది. అది చూసి వేదమూర్తి - యింట్లో అమ్మ లేదన్న సంగతి మరచి ఆనందావేశంతో ''అమ్మా! అమ్మా!! నీ గొలుసు దొరికిందే!'' అని గోడలు అదిరిపోయేలా అరిచాడు.

★

